E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 13-03-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:70|| పేజీలు–6
www.ekaburu.com



సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో
## ఫేక్ డాక్టర్ కలకలం

హైదరాబాద్ మార్చ్ 12 (ఈ-కబురు )
సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఫేక్ డాక్టర్ కలకలం సృష్టించింది. వైట్ కోట్ వేసుకుని డాక్టర్‌లా నటించి.. పేషెంట్లను బురిడీ కొట్టించింది. ట్రీట్‌మెంట్ పేరుతో ఓ రోగికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి 10 తులాల బంగారం అపహరించింది.అనారోగ్యంతో ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన సుధారాణి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నది. ఇవాళ డిశ్చార్జి కావాల్సి ఉంది.

....(మిగతా3లో)


2

### ఇంధన భద్రతపై ఇరాన్‌తో మాట్లాడాం : భారత్

ఈ కబురు : దేశ ఇంధన భద్రతపై ఇరాన్‌తో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ మాట్లాడారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వెల్లడించారు. హర్మూజ్ మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి కూడా చర్చించినట్లు తెలిపారు.


2

తెలంగాణలో ఒంటిపూట బడులు
### .. ఈ నెల 15 నుంచి కొత్త వేళలు

- ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మారిన పనివేళలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- పదో తరగతి ప్రత్యేక క్లాసులు యథాతథంగా కొనసాగింపు


3


‘తెలంగాణ పబ్లిక్ స్కూల్స్’
### ఏర్పాటు చేస్తాం

ఈ కబురు, హైదరాబాద్ :
తెలంగాణ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. మాదాపూర్‌లో జరిగిన ఒక ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ

ఫ్యూచర్ సిటీలో
# స్థలం కేటాయిస్తాం

దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో
యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు వేదిక కానుంది:సీఎం రేవంత్

ఈ కబురు, హైదరాబాద్ :
నెట్‌ఫ్లిక్స్ సంస్థ విస్తరణకు భారత్ ఫ్యూచర్ సిటీలో అవసరమైన స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను నిర్వహించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం కూడా ఈ మహానగరం నుంచి కొనసాగించాలని అభిలషించారు.



....(మిగతా2లో)

#### లారీలో 100 కిలోమీటర్ల దూరంలోని కర్నూలు వెళ్లి మొదటిరోజునే సినిమా చూసేవాళ్లం



- అల్లు సినిమాస్ ప్రారంభోత్సవం సందర్భంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- తన చిన్ననాటి జ్ఞాపకాలను మననం చేసుకున్న ముఖ్యమంత్రి

....(మిగతా2లో)

గ్యాస్ కొరతపై
# కేంద్రం జోక్యం చేసుకోవాలి



- ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ
- హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక
- చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి

ఈ కబురు ; దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు. ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్‌టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

....(మిగతా2లో)

ఎంఎస్ఎంఈలను
## పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం: భట్టి విక్రమార్క



ఈ కబురు, హైదరాబాద్:
2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనలో పీపీపీ మోడల్ అనివార్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, ఐటీశాఖ బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..

....(మిగతా2లో)




### నా దగ్గర ఎలాంటి బటన్ ఉండదు: స్పీకర్ ఓం బిర్లా

ఈ కబురు : విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. “సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి

....(మిగతా2లో)

యుద్ధం ముగింపునకు
# ఇరాన్ 3 షరతులు



ఈ కబురు ; ఇరాన్ పై అమెరికాఇజ్రాయెల్ ప్రారంభించిన ఏకపక్ష యుద్ధం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. మరోవైపు యుద్ధం ముగింపుపై రోజుకో ప్రకటనలు చేస్తున్న ట్రంప్, సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామంటున్న ఇరాన్, ఇలా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సాగిపోతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికాఇజ్రాయెల్ తో యుద్ధం ముగింపుకు మధ్య వర్తిత్వం వహించేందుకు పలు దేశాలు చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఇరాన్ స్పందించింది.

....(మిగతా2లో)

హైదరాబాద్‌లో 2,500 కిలోల
# కల్తీ పెరుగు స్వాధీనం



- అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో కల్తీ పెరుగు కలకలం
- పోలీసులు, టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ
- ఈ పెరుగును హోటళ్లు, ఫంక్షన్లకు తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు

ఈ కబురు, హైదరాబాద్ ;
గత కొన్నిరోజులుగా కల్తీ నెయ్యి గురించి మనం వార్తలు వింటున్నాం. ఇటీవల హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో కల్తీ నెయ్యి పట్టుబడింది. తాజాగా, అధికారులు కల్తీ పెరుగును కూడా పట్టుకున్నారు.

....(మిగతా2లో)

### గ్యాస్ సరఫరాపై ఆందోళన చెందవద్దు



- గ్యాస్ సరఫరా.. డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు: మంత్రి ఉత్తమ్

....(మిగతా3లో)

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై
### అసెంబ్లీ వేదికగా నిలదీస్తాం: హరీశ్‌రావు



ఈ కబురు, హైదరాబాద్:
రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. టీజీఎస్ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆయన్ను కలిసి ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి, వారి సమస్యలను సభ ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకెళ్తానని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి, కార్మికులకు అన్యాయం చేస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

....(మిగతా2లో)

### కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు



- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం
- 16వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ సమన్లు ఇచ్చిన సీబీఐ
- దీనిపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నానన్న కవిత

ఈ కబురు ; ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి ఈరోజు సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు. ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే.

....(మిగతా2లో)

### యూరియా నిల్వలపై ఫోకస్

- ప్రతి నెలా 2లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించాలి.. జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ



ఈ కబురు : రాబోయే ఖరీఫ్–2026 సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

....(మిగతా3లో)

## లారీలో 100 కిలోమీటర్ల దూరంలోని కర్నూలు వెళ్లి మొదటిరోజునే సినిమా చూసేవాళ్లం: రేవంత్ రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్ : తాను వనపర్తిలో చదువుకునే సమయంలో సినిమాలు చూడటానికి లారీలో 100 కిలోమీటర్ల దూరంలోని కర్నూలుకు వెళ్లి సెకండ్ షో చూసి వచ్చేవాళ్లమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆ రోజుల్లో హైదరాబాద్ లేదా కర్నూలు వంటి నగరాల్లో మాత్రమే సినిమాలు విడుదలయ్యేవని నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. వనపర్తి వంటి పట్టణాల్లో సినిమాలు విడుదలయ్యేవి కాదని, కాబట్టి మొదటి రోజునే సినిమా చూసేందుకు లారీల్లో కర్నూలు వెళ్లేవాళ్లమని అన్నారు. హైదరాబాద్‌లో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను కృష్ణ అభిమానిని అని తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ ఒక సంవత్సరంలో 15 నుంచి 16 సినిమాల్లో నటించిన రోజుల నుంచి ఈరోజుల్లో ఐదారేళ్లకు ఒక సినిమాలో నటించే హీరోలను చూస్తున్నామని అన్నారు. తెలుగు సినిమా పరిశ్రమ కోలీవుడ్ లేదా బాలీవుడ్‌తో పోటీపడకుండా, హాలీవుడ్‌తో పోటీ పడాలని అన్నారు. హాలీవుడ్ సినిమాలు కూడా ఇక్కడ ప్రదర్శించబడాలని ఆకాంక్షించారు. సినిమా పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అల్లు అర్జున్ హాలీవుడ్‌లోనూ రాణించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. సాంకేతికంగా మన హాలీవుడ్‌తో పోటీపడాలని అన్నారు. అల్లు అరవింద్ ఎదిగిన తీరును చూసి స్వర్గంలో ఉన్న అల్లు రామలింగయ్య మనసు ఉప్పొంగిపోతుందని అన్నారు.

# ఫ్యూచర్ సిటీలో స్థలం కేటాయిస్తాం



దేశంలో ముంబై తర్వాత హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ప్రారంభించారు. ఐలైన్ స్టూడియో ప్రారంభంతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మకమైన మార్పులకు వేదిక కానుంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ తరుణం వచ్చేసింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సరిపడా పరిమాణంలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం స్థలం కేటాయిస్తాం. అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు రిలొకేట్ చేయాలి. ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ నుంచి టెక్నోకలర్, అక్కడి నుంచి ఈస్ట్‌మన్ కలర్, తర్వాత 70 ఎంఎం, డాల్బీ, అక్కడి నుంచి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతం టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ కూడా రావాలని మొదటి నుంచి బలంగా కాంక్షిస్తున్నా. ఫార్చ్యూన్ 500 కంపెనీలను హైదరాబాద్‌లో ఏర్పాటు కావాలన్నది మా ఆకాంక్ష. 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. మీ పెట్టుబడులకు అన్ని విధాలుగా రక్షణ ఉంటుంది.

నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదం అందించాలని చూస్తోంది. మేం ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నాం. మీకూ మాకు మధ్యన సారూప్యత ఉంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ ప్రపంచంలోని అన్ని సంస్కృతులను ప్రజలను ఆహ్వానిస్తుంది. నెట్‌ఫ్లిక్స్, హైదరాబాద్ రెండూ గేట్‌వేలుగా పనిచేయడానికి దోహదపడుతాయి. ప్రపంచవ్యాప్తంగా వీక్షకుల కోసం ట్యాలెంట్, కంటెంట్‌ను నెట్‌ఫ్లిక్స్ అందిపుచ్చుకుంటే, హైదరాబాద్ అవకాశాలు, ప్రపంచ నైపుణ్యతను కలిగి ఉంది. మనం వారధి లాంటివాళ్లం. మార్పును ఆశించే వాళ్లం. డీవీడీలను అద్దెకు సమకూర్చే స్థాయి నుంచి ఓటీటీలో ప్రపంచ లీడర్‌గా నెట్‌ఫ్లిక్స్ ఎదిగింది. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి విషయాల్లో ప్రజలు నెట్‌ఫ్లిక్స్‌ను, హైదరాబాద్‌ను ప్రేమిస్తారు. ప్రపంచ వీక్షకులకు తెలంగాణను విశ్వవ్యాప్తం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ ఫెసిలిటీ ఎంతో ఉపయోగపడుతుంది. నెట్‌ఫ్లిక్స్ ఈ మధ్య కాలంలో స్పోర్ట్స్‌పై దృష్టిని సారించింది. స్పోర్ట్స్‌లో ఈ సంస్థ అతి పెద్ద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ కాబోతుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా అన్ని స్థాయిల్లో ట్యాలెంట్‌ను గుర్తించాలన్న లక్ష్యంతో క్రీడల పట్ల, క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. మీకూ మాకూ ఎంతో సారూప్యత కలిగిన నేపథ్యంలో నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ రెండూ కలిసి మంచి విజయాలను సాధించాలి. నెట్‌ఫ్లిక్స్‌కు తెలంగాణ స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం. భారత్, తెలంగాణ భవిష్యత్తులో ప్రపంచస్థాయి వినోదాన్ని అందిస్తాయనడానికి ఈ కార్యక్రమమే ఒక నిదర్శనం. మనం కలిసి భవిష్యత్తుపై బలమైన ముద్ర వేద్దాం... అని పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో గారు, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు గారు, సినీ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు గారితో పాటు నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి



గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం: భట్టి విక్రమార్క



క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ), ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ)తోపాటు సమగ్రాభివృద్ధి కోసం రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ)కి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రేర్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చేలా చూడాలని చెప్పారు. ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహించాలనేది ప్రభుత్వ ఆలోచన అని పేర్కొన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధనలో పోలీసు శాఖ పాత్ర కీలకమని చెప్పారు. భారీగా పెట్టుబడిదారులు వస్తున్న తరుణంలో శాంతిభద్రతలు ముఖ్యమన్నారు. ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని సూచించారు. పోలీసు శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలన్నారు. నేర నియంత్రణలో కీలకంగా ఉండే సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ఆదేశించారు. 41 జీసీసీలతో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇదే వేగం కొనసాగించేందుకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం ఇస్తామని తెలిపారు. డేటా సెంటర్లలో ఏఐ వినియోగాన్ని పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు.

## నా దగ్గర ఎలాంటి బటన్ ఉండదు: స్పీకర్ ఓం బిర్లా

మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది'' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు.

--భగవంతుడే నన్ను కాపాడాడు.. హత్యాయత్నంపై ఫరూక్ అబ్దుల్లా

రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్.. అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

# యుద్ధం ముగింపునకు ఇరాన్ 3 షరతులు



యుద్ధం ముగించాలంటే మూడు షరతులకు ఒప్పుకోవాలంటూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఎక్స్ లో బహిరంగంగానే అమెరికాఇజ్రాయెల్‌కు ఓ ట్వీట్ పెట్టారు. ఇందులో ఇరాన్ చట్టబద్ధమైన హక్కును గౌరవించడం, యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడం, భవిష్యత్తులో దాడులు చేయకుండా అంతర్జాతీయ స్థాయి హామీ ఇవ్వడం. ఈ మూడు కండిషన్లకు ఒప్పుకుంటే యుద్ధం ముగించేందుకు సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించారు. దీంతో ఈ షరతులను అమెరికాఇజ్రాయెల్ అంగీకరించేలా అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది.మరోవైపు ఇప్పటికే రెండు వారాలు పూర్తి చేసుకున్న ఇరాన్ వార్ కారణంగా భారత్ సహా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయి. ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. ఇది ప్రపంచ మార్కెట్‌లను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడిన భారత ఆర్థిక వ్యవస్థ దీంతో తీవ్ర ప్రమాదంలో పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన దిగుమతిదారు అయిన భారత్‌పై గల్ఫ్ అస్థిరత వేగంగా ప్రభావం చూపుతోంది. హోర్ముజ్ జలసంధి మీదుగా 40 శాతం చమురు, 60 శాతం ఎల్పీజీ దిగుమతులు చేసుకుంటున్న భారత్ ఇప్పుడు ఇరాన్ ను బతిమాలుకోవాల్సిన పరిస్థితికి వచ్చేసింది. ఈ నేపథ్యంలో చర్చలు విజయవంతమై యుద్ధం త్వరగా ముగిసినట్లయితే, భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తగ్గుతుంది. సరఫరా ఆందోళనలు తగ్గితే చమురు ధరలు మునుపటి స్థాయికి వస్తాయి. ఉద్రిక్తతలు కొన్ని వారాల్లోనే పరిష్కారమైతే, క్రూడ్ బ్యారెల్‌కు \$60\$70 పరిధిలోకి తిరిగి రావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్టాక్ మార్కెట్ల స్థిరీకరణ జరిగి ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుంది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్ కు ఆర్థిక పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయి. అధిక చమురు ధరలు రవాణా, తయారీ ఖర్చులను పెంచుతాయి, ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అదే సమయంలో, దిగుమతి బిల్లు పెరగడంతో దేశ కరెంట్ అకౌంట్ లోటు పెరుగుతుంది. చమురు ధరలలో ప్రతి 10 శాతం పెరుగుదల భారతదేశ జీడీపీ వృద్ధిని 2025 బేసిస్ పాయింట్లు తగ్గిస్తుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

-- భారత్ కోసం ఇరాన్ కీలక నిర్ణయం..!

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుని, అంతర్జాతీయ వాణిజ్యం అస్తవ్యస్తమవుతున్న వేళ భారత్‌కు అద్భుతమైన తీపి కబురు అందింది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధి గుండా భారతీయ జెండాతో ప్రయాణించే నౌకలను అనుమతించేందుకు ఇరాన్ అంగీకరించింది. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఉద్రిక్తతల దృష్ట్యా అనేక ఆంక్షలు అమలవుతుండగా, భారత్‌కు మాత్రమే లభించిన ఈ 'ప్రత్యేక అనుమతి' దౌత్యపరంగా దేశం సాధించిన పెద్ద విజయంగా కనిపిస్తోంది.భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి మధ్య జరిగిన కీలక చర్చల అనంతరం ఈ సానుకూల నిర్ణయం వెలువడింది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, భారత్‌తో ఉన్న సుదీర్ఘ మిత్రత్వాన్ని గౌరవిస్తూ ఇరాన్ ఈ హామీ ఇచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే భారత్‌కు చెందిన రెండు భారీ చమురు ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని ఎటువంటి అడ్డంకులు లేకుండా సురక్షితంగా దాటడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు దెబ్బతిని చమురు ధరలు ఆకాశాన్ని తాకుతాయన్న ఆందోళనల మధ్య, ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనివ్వనుంది. హర్మూజ్ మార్గం సుగమం కావడంతో దేశీయంగా ఇంధన కొరత ఏర్పడకుండా, ధరలు నియంత్రణలో ఉండే అవకాశం ఉంది. యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న అంతర్జాతీయ పరిణామాల మధ్య భారత్ తన ప్రయోజనాలను కాపాడుకోవడంలో మరోసారి సఫలీకృతమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇంధన భద్రతపై ఇరాన్‌తో మాట్లాడాం : భారత్



మరోవైపు, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని, దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. శ్రీలంక, మాల్దీవుల నుంచీ ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని, అయితే.. ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు.

**–సురక్షిత ప్రాంతాలకు విద్యార్థులు..**

ప్రస్తుతం ఇరాన్‌లో దాదాపు తొమ్మిది వేల మంది భారతీయులు ఉన్నారని.. వీరిలో విద్యార్థులు, నౌకా సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఘర్షణ మొదలైన వెంటనే విద్యార్థులు సహా అనేక మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉందన్నారు.

**–పాక్‌కు అలవాటే..**

అఫ్గాన్‌తో ఇటీవల ఘర్షణకు భారత్ కారణమంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ఖండించింది. అవి నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు పరిపాటేనని విమర్శించింది. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం మాటలకు విశ్వసనీయత లేదని తెలిపింది.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీ వేదికగా నిలదీస్తాం: హరీశ్‌రావు



ఒకవైపు ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఒక్కో విభాగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయం. గత రెండేళ్లుగా ఈ పథకానికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిల భారాన్ని ఆర్టీసీపైనే మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా కుదేలవుతోంది. సంస్థ ఉద్యోగులకు ఇప్పటికీ రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయి. 2025 పీఆర్సీ సైతం అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ... ఇప్పటివరకు ఈ ప్రభుత్వం 'అపాయింటెడ్ డే' ప్రకటించకపోవడం దుర్మార్గం. కార్మికులకు దక్కాల్సిన పదోన్నతులు, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు వంటి హక్కులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ప్రభుత్వం ఆర్టీసీపై సవతి తల్లి ప్రేమను చూపించకుండా.. తక్షణమే రూ.2,804 కోట్ల బకాయిలను విడుదల చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. కార్మికుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పక్షాన బలంగా వినిపిస్తాం. ప్రభుత్వం మెడలు వంచైనా పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా పోరాడుతాం'' అని హరీశ్‌రావు అన్నారు.

## కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు



సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు. ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "ఈరోజు మధ్యాహ్నం సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను" అని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో 2,500 కిలోల కల్తీ పెరుగు స్వాధీనం



హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2,500 కిలోల కల్తీ పెరుగును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాలలో కాస్టిక్ సోడాను వినియోగించి ఈ కల్తీ పెరుగును తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో అధికారులు గుర్తించారు. అంబర్‌పేట పోలీసులు, ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి తనిఖీలు చేపట్టారు. శాంపిళ్లను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. వేడి పాలలో కాస్టిక్ సోడాను వేస్తే అది పెరుగుగా మారుతుంది. ఈ పెరుగును తింటే అనారోగ్యానికి గురవుతారని సంబంధిత అధికారులు వెల్లడించారు. కల్తీ పెరుగు గురించి సమాచారం రాగానే అధికారులు గోడౌన్‌పై దాడి చేశారు. ఈ పెరుగును వివిధ హోటళ్లు, ఫంక్షన్‌లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

## తెలంగాణలో ఒంటిపూట బడులు .. ఈ నెల 15 నుంచి కొత్త వేళలు



ఈ కబురు, హైదరాబాద్ ;

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట విధానంలోనే నడుస్తాయి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. తరగతులు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

# ప్రశాంతంగా ఉండండి... ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

# పొన్నాడ త్రిమూర్తులు



డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు

**పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పొన్నాడ త్రిమూర్తులు కీలక సూచనలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షా కేంద్రానికి హాజరవడంతో పాటు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యారత్న అవార్డు గ్రహీత, విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పొన్నాడ త్రిమూర్తులు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యలో ప్రతి ఒక్కరికి కీలక ఘట్టమైన పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో విద్యార్థులు ఉండాలని, ప్రణాళికబద్ధ ప్రిపరేషన్ మీద దృష్టి పెడితే విద్యార్థుల కష్టానికి తగిన ఫలితం దక్కుతుందన్నారు. ముఖ్యంగా విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు అందరూ విజేతలుగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఆల్ ద బెస్ట్ చెప్పారు.

**విద్యార్థులకు కొన్ని సూచనలు...**

పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పొన్నాడ త్రిమూర్తులు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ, పరీక్ష కేంద్రానికి తగిన సమయానికి చేరుకోవాలన్నారు. పరీక్ష సమయాల్లో ఒత్తిడికి లోనుకాకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకొని పరీక్ష రాయాలన్నారు. చదివిన అంశాలను ఒకసారి రివిజన్ చేసుకోవడంతో పాటు పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు ఏ రంగంలో విజయం సాధించాలన్నా ఆరోగ్యం ముఖ్యమని, ముఖ్యంగా పరీక్షల సమయంలో ఆరోగ్యం, నిద్ర మీద శ్రద్ధ వహించాలని అన్నారు. పరీక్ష పూర్తి చేసే సమయంలో ఒకసారి రాసింది మొత్తం డబుల్ చెక్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల అంకితభావం, కృషి ఖచ్చితంగా విజయాన్ని అందిస్తామని, ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని నమ్మకాన్ని పెంచుకోవాలన్నారు.

# విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు కీలక మైలురాయి

## కొమిరిశెట్టి సాయిబాబా




సమావేశంలో ప్రసంగిస్తున్న కొమిరిశెట్టి సాయిబాబా




విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేస్తున్న దృశ్యం

**ఖాజాగూడ స్కూల్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేత**

ఈకబురు, శేరిలింగంపల్లి : ప్రతి విద్యార్థి జీవితంలో పదవ తరగతి పరీక్షలు కీలక మైలురాయి అని, విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టం పదవ తరగతి పరీక్షలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న ఖాజాగూడ ప్రభుత్వ పాఠశాలను గురువారం కొమిరిశెట్టి సాయిబాబా సందర్శించారు. పదవ తరగతి చదివి స్కూల్ ను వదిలి వెళ్లే విద్యార్థులకు ఖాజాగూడ స్కూల్ లో ఫేర్వెల్ పార్టీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సంవత్సరం గురువారం నిర్వహించిన ఫేర్వెల్ పార్టీకి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్,,జియోమెట్రీ బాక్స్ ,పెన్ ,పెన్సిల్, స్కేల్ కిట్ లను అందజేశారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. తమను కష్టపడి చదివిస్తున్న కన్న తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని విద్యార్థులు గుర్తించాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు హాజరుకావాలని, తగిన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, నరహరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# యూరియా నిల్వలపై ఫోకస్



రాష్ట్రానికి వచ్చే ఏప్రిల్, మే, జూన్ నెలలకు ప్రతి నెల 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు గురువారం లేఖ రాశారు. రాష్ట్ర అవసరాలను వివరించారు. గత రబీ సీజన్‌లో రాష్ట్రానికి సమయానికి యూరియా కేటాయించినందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేశామన్నారు.

--4.65 లక్షల మెట్రిక్ టన్నులు

ఆ కేటాయింపుల వల్ల గత ఖరీఫ్ లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా వ్యవసాయ పనులు సజావుగా సాగాయని తెలిపారు. రబీ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ఖరీఫ్-2026 సీజన్ ప్రారంభానికి యూరియా ప్రారంభ నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ఉండవచ్చని మంత్రి తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ లో రాష్ట్రానికి గణనీయమైన ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరా సాఫీగా జరిగిందని గుర్తు చేశారు. ఖరీఫ్-2024 లో 4.65 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, ఖరీఫ్-2025లో 1.99 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండటం వల్ల ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రావడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ప్రారంభ నిల్వలు 50 వేలకు మించి ఉండకపోవచ్చని వెల్లడించారు.

**--ఈ సీజన్‌లో విస్తృతంగా సాగు చేస్తాం**

2024 ఖరీఫ్ సీజన్లో ఉన్న నిల్వలు రాష్ట్రానికి బఫర్ స్టాక్ ఏర్పాటుకు దోహదపడి రైతులకు ఎరువులు నిరంతరంగా అందుబాటులో ఉండేలా చేశాయని తెలిపారు. అయితే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ఈ విధంగా ప్రారంభ నిల్వలు ఉంచుకోవడం ఇప్పుడు ప్రాధాన్యతగా మారిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో మొత్తం సాగు విస్తీర్ణంలో దాదాపు 70 శాతం పంటలు ఖరీఫ్ సీజన్‌లోనే సాగు అవుతాయని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు ఈ సీజన్‌లో విస్తృతంగా సాగు చేస్తారని, ఈ పంటలకు అధిక మొత్తంలో యూరియా అవసరం ఉంటుందన్నారు. సాధారణంగా రాష్ట్రంలో జూలై, ఆగస్టు నెలల్లో యూరియా వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఖరీఫ్ సీజన్ కొంత ముందుగానే ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులకు సమయానికి ఎరువులు అందుబాటులో ఉండేందుకు ముందుగానే నిల్వలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వినియోగం తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం ద్వారా తరువాతి నెలల్లో పెరిగే డిమాండ్‌ను సులభంగా తట్టుకోవచ్చని పేర్కొన్నారు.

**నెలకు 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం**

ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ ఎక్కువగా ఉండే జూలై , ఆగస్టు నెలల్లో కనీసం నెలకు 3లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే తగిన నిల్వలు సిద్ధం చేయడం ద్వారా రైతులకు ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయవచ్చని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బఫర్ నిల్వలు ఏర్పాటుకు అనుకూలంగా సరఫరా ప్రణాళిక కింద ఏప్రిల్, మే, జూన్ నెలలకు ప్రతి నెల 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కేటాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే తగిన నిల్వలు ఏర్పరచుకుని ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉంచగలదని మంత్రి తెలిపారు.

# సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఫేక్ డాక్టర్ కలకలం



ఈ క్రమంలో ట్రీట్‌మెంట్ పేరుతో పేషెంట్ గదిలోకి వెళ్లిన నకిలీ డాక్టర్.. ట్రీట్‌మెంట్ పేరుతో రోగి బంధువులను బయటకు పంపించింది. అనంతరం మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఒంటిపై ఉన్న 10 తులాల బంగారం అపహరించింది. అనంతరం అక్కడి నుంచి జారుకుంది. కాసేపటికి రోగి బంధువులు లోపలికి వెళ్లి చూడగా ఒంటిపై బంగారం కనిపంచకపోవడంతో ఆందోళన చెందారు. దీనిపై యాజమాన్యాన్ని సంప్రదించగా.. ఆమె ఎవరో తెలియదని సమాధానం ఇచ్చారు. దీంతో రోగి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫేక్ డాక్టర్ కలకలం నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, నర్సింగ్ స్టాఫ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల్లో నకిలీ డాక్టర్ కదలికలు రికార్డయ్యాయి. తెలిసిన వ్యక్తేనా? లేక బయటి వ్యక్తినా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# గ్యాస్ సరఫరాపై ఆందోళన చెందవద్దు



ఈ కబురు, సూర్యాపేట:
ప్రస్తుతానికి తెలంగాణలో డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమర్షియల్ గ్యాస్ మాత్రమే కొంత సరఫరా ఆగిందన్నారు. సూర్యాపేటలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''గ్యాస్ కొరతపై శుక్రవారం ఆయిల్ కంపెనీలతో సమీక్షిస్తాం. సీఎస్, కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తాం. జన జీవనానికి ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా చేస్తాం. ఎల్‌పీజీ విషయంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందవద్దు'' అని చెప్పారు.

--కేంద్రం పట్టించుకోవట్లేదు: మంత్రి పొన్నం

ప్రజలు గ్యాస్ కొరతతో ఇబ్బంది పడుతున్నా కేంద్రం పట్టించుకోవట్లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది భాజపా ఎంపీలున్నా సరిపడా గ్యాస్ తీసుకురావట్లేదని విమర్శించారు. భవిష్యత్తులో ఎరువుల కొరత కూడా ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

--జేపీ నడ్డాకు తుమ్మల లేఖ

ఖరీఫ్‌కు యూరియా నిల్వలు సిద్ధంగా ఉంచుకునేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రానికి సరిపడా యూరియా కేటాయించాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్‌లో ప్రతి నెల 2 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరియా సరఫరాపై కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తాం

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా కొత్త విద్యా విధానాన్ని తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'నర్సరీ నుండి 12వ తరగతి' (Nursery to 12th) వరకు ఒకే ప్రాంగణంలో విద్యనందించే సమగ్ర విధానాన్ని అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. దీనివల్ల విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే చోట విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రతి నియోజకవర్గంలో మోడల్ స్కూల్స్ తరహాలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ స్కూళ్లలో విద్యార్థులకు ఉదయం నాణ్యమైన టిఫిన్, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం తరపున ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రవాణా సౌకర్యం విషయంలో కూడా ముఖ్యమంత్రి విద్యార్థులకు తీపి కబురు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా లేదా 50 శాతం రాయితీతో బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. దీనివల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణ భారం తగ్గుతుందని ఆశిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు కూడా తమ లాభాల్లో కొంత భాగాన్ని పేదల వైద్యం కోసం కేటాయించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. విద్యా, వైద్య రంగాల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# బీఆర్ఎస్ మూడు ముక్కలైంది

## .. మళ్లీ కాంగ్రెస్‌దే విజయం.. మహేష్ కుమార్ గౌడ్ ధీమా

ఈ కబురు ; తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ బలమైన ముద్ర వేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో జరిగిన ఎస్సీ సెల్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల పాలనలో ప్రజలను వంచించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు మూడు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును దోచుకోవడం, దాచుకోవడం, ఆపై పంచుకోవడంలో తలెత్తిన విభేదాల వల్లే ఆ పార్టీ ఈ స్థితికి చేరుకుందని విమర్శించారు. దళితులను తీవ్రంగా అవమానించిన చరిత్ర ఉన్న బీజేపీకి తెలంగాణలో అధికారం దక్కడం కల్ల అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పునాదుల్లోనే దళితవాదం ఇమిడి ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సామాజిక న్యాయం పాటించడంలో తమ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని గుర్తు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా దళితుడైన మల్లికార్జున ఖర్గేను ఎన్నుకోవడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. పార్టీలో పదవుల పంపిణీ విషయంలోనూ సమతుల్యత పాటిస్తున్నామని చెప్పారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇస్తే.. బీసీ వర్గానికి చెందిన తనకు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారని వివరించారు. పెద్ద పదవులు దక్కించుకోవాలనే ఆశయం ఉన్నవారికి కాంగ్రెస్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ సమర్థతపై నమ్మకంతోనే ఆయనకు ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడంలో దళిత సోదరులు కీలక పాత్ర పోషించారని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు దళితులు అండగా నిలబడ్డారని గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు రాష్ట్ర, జిల్లా కమిటీల్లో దళితులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో 17 శాతం ఉన్న ఎస్సీలకు నాలుగు మంత్రి పదవులు కేటాయించి తమ గౌరవాన్ని చాటుకున్నామని వెల్లడించారు. దళితులు, గిరిజనులను విస్మరించిన ఏ రాజకీయ పార్టీ మనుగడ సాగించలేదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. గతంలో కేసీఆర్ తన కేబినెట్‌లో ఉన్న దళిత నేత రాజయ్యను అర్ధరాత్రి వేళ బర్తరఫ్ చేసి ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. ఇటువంటి చర్యలే ఆ పార్టీ పతనానికి దారితీస్తున్నాయని విశ్లేషించారు. రాబోయే మూడేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో కూడా తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## రాపిడోకు 74 మిలియన్ యాక్టివ్ యూజర్లు..
# ఉబర్ కంటే డబుల్




ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో తన హవా కొనసాగిస్తోంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 మధ్య రికార్డు స్థాయిలో 73.96 మిలియన్ నెలవారీ యాక్టివ్ యూజర్లను నమోదు చేసినట్లు యాప్ ఇంటెలిజెన్స్ సంస్థ సెన్సార్ టవర్ వెల్లడించింది. ఈ విషయంలో ఉబర్, ఓలాను ర్యాపిడో వెనక్కి నెట్టింది. ఉబర్ 39.05 మిలియన్ యాక్టివ్ యూజర్లు, ఓలా 28.15 మిలియన్ యాక్టివ్ యూజర్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఉబర్‌తో పోలిస్తే ర్యాపిడో యాక్టివ్ యూజర్ల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం గమనార్హం.

వారపు యాక్టివ్ యూజర్ల విషయంలోనూ ర్యాపిడోదే అగ్రస్థానం. జనవరి 19 నుంచి ఫిబ్రవరి 22 మధ్య ర్యాపిడోకు 40.07 మిలియన్ యాక్టివ్ యూజర్లు ఉండగా.. ఉబర్ 20.56 మిలియన్, ఓలా 11.63 మిలియన్ యూజర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. క్యాబ్ సేవల విషయంలో ఒకప్పుడు ఓలా, ఉబర్‌దే హవా. అలాంటి సమయంలో బైక్ ట్యాక్సీ సేవలను ర్యాపిడో ప్రారంభించింది. తర్వాత త్రీ వీలర్, ఫోర్ వీలర్ రైడ్ షేరింగ్‌లోకి ప్రవేశించింది. పట్టణాల్లో తక్కువ దూర ప్రయాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం, సులభమైన బుకింగ్ ప్రక్రియ వంటి అంశాలతో వినియోగదారులను ఆకర్షిస్తోంది. తద్వారా ఓలా, ఉబర్ ఆధిపత్యానికి ర్యాపిడో గండి కొట్టింది.

## 7,200mAh బ్యాటరీతో ఐకూ
# నుంచి Z11x 5G.. ఫీచర్లు ఇవే




చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వివో సబ్ బ్రాండ్ ఐకూ దేశీయ మార్కెట్‌లోకి కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఐకూ Z11కు కొనసాగింపుగా iQOO Z11x 5G పేరిట దీన్ని విడుదల చేసింది. ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్‌సిటీ 7400 ప్రాసెసర్, 7,200mAh బ్యాటరీ, 44W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ వంటి సదుపాయాలతో ఈ ఫోన్‌ను తీసుకొచ్చారు. ధర, ఇతర ఫీచర్లు ఇప్పుడు చూద్దాం.

ఫోన్ ఫీచర్లు

ఐకూ Z11x 5G ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజిన్ ఓఎస్6తో పనిచేస్తుంది. 6.76 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేట్, 1,200 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో పనిచేస్తుంది. IP68+IP69+ రేటింగ్ ఉంది. సైడ్ మౌంటెండ్ ఫింగర్ ప్రింట్ స్కానర్ ఇచ్చారు. 50ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ బొకే కెమెరాతో వస్తోంది. 32ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉంది. ఫోన్ బరువు 219 గ్రాములు.

ఐకూ Z11x 5G మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. బేస్ వేరియంట్ 6GB + 128GB ధర రూ.18,999, 8GB +128GB వేరియంట్ ధర రూ.20,999, 8GB +256GB వేరియంట్ ధర రూ.22,999గా కంపెనీ నిర్ణయించింది. యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ వినియోగదారులకు రూ.2 వేలు వరకు డిస్కౌంట్ లభిస్తుంది. రెండేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, నాలుగేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. మార్చి 16 నుంచి అమెజాన్‌లో విక్రయాలకు రానుంది. ప్రిస్మాటిక్ గ్రీన్, టైటాన్ బ్లూ రంగుల్లో ఇది లభ్యమవుతుంది.

## వాట్సప్‌లో పేరెంట్ కంట్రోల్ సదుపాయం



ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ (Whatsapp) కొత్త సదుపాయాన్ని తీసుకొచ్చింది. 13 ఏళ్లలోపు పిల్లల కోసం పేరెంట్ మేనేజ్డ్ మోడల్‌ను లాంచ్ చేసింది. ఈ ఖాతాలను తల్లిదండ్రులు నియంత్రించేలా రూపొందించినట్లు వాట్సప్ వెల్లడించింది. వీటిని తల్లిదండ్రులు/గార్డియన్ సెటప్ చేయాల్సి ఉంటుంది. ఈ అకౌంట్ తల్లిదండ్రుల అకౌంట్‌తో లింక్ అయ్యి ఉంటుంది. పిల్లలు మెసేజింగ్, కాలింగ్ మాత్రమే చేయగలరు. ఛానెల్స్, స్టేటస్, లొకేషన్ షేరింగ్ వంటి సదుపాయాలు ఉండవు. అంతేకాదు ఎవరితో కాంటాక్ట్, ఏ గ్రూప్‌లో జాయిన్ అవ్వాలో కూడా తల్లిదండ్రులే నియంత్రిస్తారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి మెసేజులు వస్తే తల్లిదండ్రులు చూసి అనుమతించాలి. పేరెంటల్ కంట్రోల్స్, ప్రైవసీ సెట్టింగ్స్ కోసం ఓ పిన్ ఉంటుందని, దాన్ని తల్లిదండ్రులు మాత్రమే మార్చగలరని వాట్సప్ పేర్కొంది. మెసేజులకు మాత్రం ఎప్పటిలానే ఎండ్‌టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది. కాబట్టి సందేశాలను పేరెంట్స్ కూడా చదవలేరు. ఈ ఫీచర్ దశలవారీగా యూజర్లకు, కొన్ని రోజుల్లో అందరికీ అందుబాటులోకి రానుంది.

# వాట్సప్, ఫేస్‌బుక్‌లో యాంటీ స్కామ్ టూల్స్.. ఎలా పనిచేస్తాయంటే?



వాట్సప్, ఫేస్‌బుక్ వేదికగా జరిగే మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా సిద్ధమైంది. సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను రక్షించేందుకు కొత్తగా యాంటీ స్కామ్ టూల్స్‌ను (Anti Scam Tools) ప్రవేశపెట్టింది. వాట్సప్, ఫేస్‌బుక్, మెసెంజర్ యాప్‌లలో ఆయా టూల్స్ పనిచేస్తాయి. ఇవి మోసాలను గుర్తించడంతో పాటు కేటుగాళ్ల బారిన పడకుండా యూజర్లను నిలువరించడంలో సాయపడతాయి.

వాట్సప్‌లో ఇలా..

వాట్సప్ వేదికగా నిత్యం సైబర్ మోసాలు జరుగుతుంటాయి. ఇందులో డివైజ్ లింకింగ్ ఫీచర్ ఉపయోగించేవి చేసేవే అధికం. వాట్సప్ యూజర్ల సౌలభ్యం కోసం తీసుకొచ్చిన ఈ ఫీచర్ ద్వారా కేటుగాళ్లు సదరు వ్యక్తి అకౌంట్‌ను తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. వారి వ్యక్తిగత సందేశాలు చదవడంతో పాటు, వారి పేరిట డబ్బులు అడగడం, గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్‌ను పోస్ట్ చేయడం వంటివి చేస్తుంటారు. ఇలా లింక్ డివైజ్ ఫీచర్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వాట్సప్ కొత్త సదుపాయం తీసుకొచ్చింది. ఎవరైనా లింక్ డివైజ్‌ను అనధికారికంగా వాడదామని ప్రయత్నిస్తే.. చివరి నిమిషంలో 'బహుశా ఇది స్కామ్ అయ్యుండొచ్చు' అంటూ ఒక అలర్ట్ చేయడంతో పాటు 'డోంట్' లింక్ అనే ఆప్షన్ క్లిక్ చేసి బయటకు వచ్చేసే అవకాశాన్ని మెటా కల్పిస్తోంది.

ఫేస్‌బుక్ ఫ్రెండ్ రిక్వెస్ట్

కొన్నిసార్లు ఫేస్‌బుక్ ఫ్రెండ్ లిస్ట్‌లో ఉన్న వ్యక్తుల నుంచే మళ్లీ కొత్తగా ఫ్రెండ్ రిక్వెస్టులు వస్తుంటాయి. ఇంకో ఖాతా అయ్యుంటుందిలే అని యాక్సెప్ట్ చేసే వారే ఎక్కువ. ఇది వరకే కొందరు మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండడం వల్ల ఎక్కువ మంది నమ్మి ఓకే చేస్తుంటారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఖాతా నుంచి మెసేజులు పెడుతూ అత్యవసరం పేరిట డబ్బులు అడగడం వంటివి చేస్తుంటారు. ఈ తరహా మోసాలకు చెక్ పెట్టేందుకు మెటా కొత్త ఏఐ టూల్‌ను తీసుకొచ్చింది. ఏదైనా అనుమానిత ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వస్తే.. వారి లొకేషన్, మ్యూచువల్ కాంటాక్టులు, ఫేస్‌బుక్‌లో చేరి ఎన్ని రోజులైంది? వంటి వివరాలు చూపించి అలర్ట్ చేస్తుంది. ఫేస్‌బుక్ మెసెంజర్‌లో కూడా కొత్త ఖాతా నుంచి వచ్చే సందేశాల పట్ల యూజర్లను అప్రమత్తం చేస్తుంది.

# బేర్ ఖాతాలోకి మరో రోజు... సెన్సెక్స్ 830 పాయింట్లు పతనం



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం రోజురోజుకూ తీవ్రతరం అవుతుండడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం వంటివి ప్రతికూల ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి భగ్గుమనడం కూడా సెంటిమెంట్ దెబ్బతీసింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లు బేర్‌గుప్పిట్లోకి వెళ్లాయి. సందట్లో సడేమియా అన్నట్లు భారత్ సహా 16 దేశాల వాణిజ్య పద్ధతులపై ట్రంప్ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించడంతో కొత్త టారిఫ్ భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్లకు పైగా పతనమైంది. నిఫ్టీ 23,650 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 76,369.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,863.71) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,871.18 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 829.29 పాయింట్ల నష్టంతో 76,034.42 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 227.70 పాయింట్ల నష్టంతో 23,639.15 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.17గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.50 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5185 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ వద్ద ఉన్న వ్యూహాత్మక నిల్వలను విడుదల చేసేందుకు పలు దేశాలు నిర్ణయం తీసుకుంటున్నప్పటికీ.. గురువారం చమురు ధరలు దూసుకెళ్లాయి. ఓ దశలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతుండటం బుధవారం అమెరికా మార్కెట్లలో నాస్‌డాక్ మినహా మిగతా సూచీలన్నీ నష్టాల్లో ముగిశాయి. దీంతో నేటి ఆసియా మార్కెట్లతో పాటు మన దేశ స్టాక్ మార్కెట్‌పై ప్రభావం పడింది.

ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అక్కడి సర్కారు మరో నిర్ణయం తీసుకుంది. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌తో సహా 16 దేశాల ఆర్థిక వ్యవస్థలపై దర్యాప్తునకు ఆదేశించింది. కొత్త టారిఫ్‌లు విధించేందుకు ఇది మరో మార్గం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం కూడా మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

# ఏప్రిల్ 1 నుంచి పెరగనున్న ఆడి కార్ల ధరలు



దిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి (Audi) వాహన ధరల్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. భారత్‌లో విక్రయిస్తున్న అన్నిరకాల మోడళ్లపై 2 శాతం వరకు ధరలు పెంచుతామని వెల్లడించింది. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో పెరుగుతున్న ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ హెచ్చుతగ్గులే ఇందుకు కారణమని పేర్కొన్నారు. భారత్‌లో లగ్జరీ కార్లతో పాటు ఎస్‌యూవీలను ఆడి విక్రయిస్తోంది. క్యూ3 ఎస్‌యూవీ నుంచి ఎస్‌యూవీ ఆర్‌ఎస్ క్యూ8 వరకు రూ.43.23 లక్షల నుంచి రూ. 2.34 కోట్ల ధరల శ్రేణిలో వీటిని విక్రయిస్తోంది.

## దీనికి ముగింపు పలకండి..

## రాజేంద్ర ప్రసాద్ వ్యాఖ్యలపై విశాల్



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇటీవల ఒక కార్యక్రమంలో తమిళ దిగ్గజ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.జి.రామచంద్రన్ (MGR) గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా దీనిపై హీరో విశాల్ స్పందించారు. ఒకరిని ప్రశంసించే క్రమంలో మరొక దిగ్గజ నటుడిని కించపరచడం సరికాదంటూ ఎక్స్ వేదికగా అసహనం వ్యక్తంచేశారు. “మీపై గౌరవం, మీరు చేసిన వ్యాఖ్యలపై బాధతో ఈ పోస్ట్ చేస్తున్నా. ఎంజీఆర్‌పై మీరు చేసిన వ్యాఖ్యలు విని బాధపడ్డాను. దిగ్గజ నటుడు కాంతారావుని పొగడటం మంచి విషయమే.. కానీ, ఈ క్రమంలో తమిళ ప్రజలు దైవంలా భావించే ఎంజీఆర్‌ని తక్కువ చేసి మాట్లాడటంతో నాతోపాటు లక్షలాది మంది బాధ పడ్డారు. మిమ్మల్ని క్షమాపణలు చెప్పమని అడుగుతున్నందుకు నన్ను మన్నించండి. కానీ, భవిష్యత్తులో ఇలా ఎవరు మాట్లాడినా నేను ఇలాగే స్పందిస్తాను” అని విశాల్ అన్నారు. ఈ వివాదానికి ముగింపు పలకాలని కోరారు.

ఇటీవల ఓ కార్యక్రమంలో కాంతారావును ప్రశంసించే క్రమంలో ఎంజీఆర్‌పై రాజేంద్రప్రసాద్ కామెంట్స్ చేశారు. కాంతారావును చూసి ఎంజీఆర్ భయపడేవారని అన్నారు. ఈ కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. దీనిపై రాజేంద్రప్రసాద్ స్పందించాల్సి ఉంది.



## తన భార్యపై ప్రశంసలు కురిపించిన అల్లు శిరీష్

టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ తన వివాహం తర్వాత జీవితంలో చోటుచేసుకున్న మార్పులను, వేడుక విశేషాలను పంచుకున్నాడు. తన ప్రియురాలు నయనికను పెళ్లాడిన శిరీష్... వివాహానంతరం ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో తన భార్యపై ప్రశంసల వర్షం కురిపించాడు. నయనిక చాలా తెలివైనదని, తన కుటుంబ సభ్యులతో చాలా త్వరగా కలిసిపోయిందని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఎక్కడికి వెళ్లినా తన ఒక్కడికే ఖర్చు పెట్టుకునేవాడినని, ఇప్పుడు ఇద్దరి బిల్లులు కట్టాల్సి ఉంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు.పెళ్లి వేడుకలో తన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పోషించిన పాత్ర గురించి శిరీష్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ఇంత పెద్ద వేడుకలో చిన్నపాటి పొరపాట్లు జరగడం సహజమని, వాటిని పట్టించుకోకుండా ప్రతి క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలని బన్నీ ఇచ్చిన సలహా తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. అల్లు అర్జున్ స్వయంగా పెళ్లి పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించాడని, వేడుక ముగిసే వరకు అక్కడే ఉండి అన్ని బాధ్యతలు నెరవేర్చాడని శిరీష్ గుర్తు చేసుకున్నాడు. అంతేకాకుండా, టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహం కూడా తన పెళ్లికి కొన్ని రోజుల ముందే జరిగిందని... విజయ్ సొంత పనుల ఒత్తిడిలో ఉండి కూడా తన వివాహ వేడుకకు హాజరై తన స్నేహాన్ని చాటుకున్నారని తెలిపాడు.

## ముంబయి ఉగ్ర దాడుల కథ...

# నర్సు పాత్రలో కంగన?

సమాజంలో పాతుకుపోయిన వాస్తవాలను లోతుగా అన్వేషించే వైవిధ్యమైన పాత్రలతో తెరపై ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది బాలీవుడ్ కథానాయిక కంగన. గతేడాది ‘ఎమర్జెన్సీ’ చిత్రం తర్వాత ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న సినిమా ‘భారత్ భాగ్య విధాత’(వర్కింగ్ టైటిల్). మనోజ్ తపాడియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కూడా నిజ జీవిత వాస్తవాల ప్రేరణగా రూపొందుతోందని.. ఇందులో కంగన...నర్సు పాత్ర పోషించనుందని తెలుస్తోంది. “భారత్ భాగ్య విధాత’ సినిమాలో కంగనా నర్సుగా కనిపించనుంది. ఈ సినిమా ముంబయిలో జరిగిన 26/11 ఉగ్రవాద దాడుల నేపథ్యంలో ఓ ఆసుపత్రిలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఉగ్రవాదుల అధీనంలో ఉన్న ఆసుపత్రి, అందులో ప్రాణపాయ స్థితిలో ఉన్న వారందర్నీ వైద్య సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించారో చూపించడమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఆసుపత్రి ఉద్యోగులు చేసిన వీరోచిత పోరాటం, వారి సేవల ప్రేరణగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో మరాఠి నటి గిరిజా ఓక్ కూడా నటిస్తుంది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంద”ని బాలీవుడ్ వర్గాలు చెప్పినట్లు సమాచారం.



## 8ఏళ్లుగా నాపై తప్పుడు ప్రచారం..

## ఇకపై మౌనంగా ఉండను: రష్మిక



సామాజిక మాధ్యమాల వేదికగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై నటి రష్మిక మందన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కన్నడ మీడియా, ఇన్‌ఫ్లూయెన్సర్లపై మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని హెచ్చరిస్తూ ఘాటైన లేఖ రాశారు.

‘8 ఏళ్లుగా నాపై తప్పుడు ప్రచారం చేస్తూ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. నేను ఎప్పుడు మాట్లాడని పదాలతో కొంతమంది కథనాలు రాస్తున్నారు. తప్పుడు ప్రచారం నన్నెంతో బాధపెట్టినప్పటికీ ఎంతో సహనంతో ఉన్నాను. 8 ఏళ్ల కిందటి ఒక ప్రైవేటు సంభాషణలోని కొంత భాగాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో నాపై తీవ్రమైన దుష్ప్రచారం చేశారు. నా వ్యక్తిగత గోప్యతపై తీవ్రమైన దాడి చేస్తూ పరువు నష్టం కలిగిస్తున్నారు’’

‘‘ఇకపై నేను మౌనంగా ఉండలేను. సోషల్ మీడియా, ఇన్ ఫ్లూయెన్సర్లు వెంటనే తప్పుడు కథనాలను తొలగించాలి. తప్పుడు కథనాలను తొలగించేందుకు 24 గంటల సమయం ఇస్తున్నా. రేపటి నుంచి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. నోటీసులు జారీ చేస్తాను. నా జీవితం ఎలా ఉండాలో వాళ్లు ఎలా నిర్ణయిస్తారు? మన జీవితాలు మనవి, మనమే నిర్ణయాలు తీసుకోవాలి’’ అని రష్మిక మండిపడ్డారు.

## ‘ధురంధర్’ పార్ట్1 రీరిలీజ్.. 500 థియేటర్స్ లో..



పాత సినిమాలు కదా.. రీరిలీజ్ చేసేది. ఇటీవల విడుదలైన ‘ధురంధర్’ (Dhurandhar) మళ్లీ విడుదల చేయడం ఏంటి అనుకుంటున్నారా? మీరు చదివింది నిజమే! మరో వారంలో ‘ధురంధర్: ది రివెంజ్’ విడుదల పెట్టుకుని చిత్ర బృందం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ‘ధురంధర్’ బాక్సాఫీస్ వద్ద ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. డిసెంబరు 5న వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా మార్చి 19న ‘పార్ట్2’ (dhurandhar 2 release date) వస్తోంది. ఈ నేపథ్యంలో ‘పార్ట్1’ను రీరిలీజ్ చేస్తున్నారు. గురువారం నుంచే ఈ ప్రక్రియ మొదలైంది. ఈ శుక్రవారం బాక్సాఫీస్ వద్ద పెద్దగా సినిమాలు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఓటీటీలో విడుదలైనా ఇప్పటికీ కొన్ని చోట్ల ఈ సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 500 థియేటర్స్‌లో ‘ధురంధర్’ను రీరిలీజ్ చేస్తున్నారు. ఇండియాలో ఏకంగా 250 థియేటర్స్‌లో తీసుకురావడం గమనార్హం. నార్త్ అమెరికాలో 185 సినిమాస్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకూ తొలి భాగాన్ని అటు థియేటర్, ఇటు ఓటీటీలో చూడలేని వారికి ఇదొక సరికొత్త అనుభూతి. చిత్ర బృందం ప్రకటన చూసి ‘వాడకం మామూలుగా లేదుగా’ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## పిల్లలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు... ముంబై కార్పొరేషన్ పై దీపిక పదుకొణె ఫైర్

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో నానాటికీ పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణలో మహారాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందంటూ సోషల్ మీడియా వేదికగా అధికారుల తీరును ఆమె సూటిగా ప్రశ్నించారు. గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ముంబై నగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) డేటాను దీపిక షేర్ చేశారు. నగరం సగటు ఏక్యూఐ 150గా ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేస్తూ, "ఈ నగరం, ఇక్కడి పిల్లలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు! ఇది ఎలా సమర్థనీయం!? దయచేసి సహాయం చేయండి" అని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), దాని ఆరోగ్య విభాగాన్ని ట్యాగ్ చేశారు. 2024 సెప్టెంబరులో రణ్‌వీర్ సింగ్‌తో తనకు కుమార్తె 'దువా' జన్మించడంతో, ఒక తల్లిగా కూడా దీపిక ఈ అంశంపై గట్టిగా స్పందించారు.

గత ఏడాదిగా ముంబైలో వాయు నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నగర వ్యాప్తంగా ఏక్యూఐ 230250 మధ్య నమోదవగా, బీకేసీ, ఘాట్‌కోపర్, ములుండ్ వంటి ప్రాంతాల్లో 290కి చేరింది. నగరంలో పెద్ద ఎత్తున జరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇతర నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న ధూళి కాలుష్యానికి ప్రధాన కారణంగా మారింది. తవ్వకాలు, శిథిలాల రవాణా వల్ల గాలిలో పీఎం10, పీఎం2.5 ధూళి కణాలు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. నిబంధనలు పాటించని నిర్మాణాలే కాలుష్యానికి కారణమని అధికారులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోని 1000కి పైగా నిర్మాణ



ప్రాజెక్టులకు బీఎంసీ స్టాప్‌వర్క్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు, కాలుష్య నియంత్రణలో అధికారుల వైఫల్యంపై బాంబే హైకోర్టు సైతం పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసింది.

## ఉస్తాద్ భగత్‌సింగ్ 'కాలరే ఎత్తరా..' సాంగ్ విడుదల



పవన్ కల్యాణ్- హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ‘ఉస్తాద్ భగత్‌సింగ్’. తాజాగా ఈ మూవీ నుంచి కాలరే ఎత్తరా ఫుల్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రచించిన ఈ పాటను సింగర్ రామ్ మిరియాల ఆలపించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. మార్చి 19న ఈ చిత్రం విడుదల కానుంది. ఇందులో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్స్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు.

## గుకేశ్‌కు ఈసారి ఓటమి తప్పదు!





భారత చెస్ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తన చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకోవడం కష్టమేనని చెస్ దిగ్గజం జుడిత్ పోల్గర్ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. 2024 డిసెంబర్‌లో వరల్డ్ చాంపియన్‌గా అవతరించిన గుకేశ్‌తో త్వరలో చెస్ క్యాండిడేట్ టోర్నీ విజేతతో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

ఈ నేపథ్యంలో జుడిత్ పోల్గర్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈసారి గుకేశ్ టైటిల్ నిలబెట్టుకోవడ కష్టమని, ఎందుకంటే క్యాండిడేట్ చెస్ టోర్నీ విజేత అతడిని ఓడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. 'గుకేశ్ ఈసారి విఫలయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కానీ ఈసారి చాంపియన్‌షిప్ తర్వాత మరోసారి గుకేశ్ చాంపియన్‌గా నిలుస్తాడా అనేది చెప్పడం సందేహమే. 2024లో చైనా దిగ్గజం డింగ్ లిరెన్‌ను ఓడించిన గుకేశ్ అత్యంత పిన్న వయస్సులో చాంపియన్‌గా నిలిచాడు. కానీ ఈసారి గుకేశ్ ఆటతీరులో మార్పు కనిపిస్తుంది. 2024 నుంచి గుకేశ్ ఆడిన గేముల్లో డ్రాలతో పాటు ఓటములు కూడా ఉన్నాయి. దీంతో గుకేశ్‌పై సహజంగానే ఒత్తిడి ఉంటుందనడంలో సందేహం లేదు. అందుకే అతడు జాగ్రత్తగా ఆడితే తప్ప చాంపియన్‌షిప్ టైటిల్ నిలబెట్టుకోలేకపోవచ్చు.' అని చెప్పుకొచ్చారు.

కాగా ఇటీవల కాలంలో జరిగిన టోర్నీల్లో గుకేశ్ కేవలం ప్రేగ్ మాస్టర్స్ టోర్నీలో మాత్రమే విజయాన్ని అందుకున్నాడు. 2025లో విజ్ ఆన్ వేదికగా జరిగిన టాటా మాస్టర్స్ చెస్ టోర్నీలో పాల్గొన్నగుకేశ్ భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానందతో తలపడ్డాడు. చివరి రౌండ్ వరకు నువ్వా నేనా అన్నట్లుగా సాగిన పోరులో టైటిల్‌ను డిసైడ్ చేసేందుకు టైబ్రేకర్ వరకు వెళ్లాల్సి వచ్చింది. కానీ టైబ్రేక్ ప్రజ్ఞానంద విజయం సాధించడంతో గుకేశ్‌కు నిరాశే మిగిలింది.

## వివాదంలో కావ్యా మారన్.. సన్‌రైజర్స్ లోకి పాక్ ఆటగాడు



సన్‌రైజర్స్ హైదరాబాద్ సహ యజమాని కావ్యా మారన్ వివాదంలో చిక్కుకుంది. హండ్రెడ్ లీగ్ 2026 వేలంలో పాక్ ఆటగాడిని కొనుగోలు చేసి, భారత క్రికెట్ అభిమానుల నుంచి భారీ ట్రోలింగ్‌ను ఎదుర్కొంటుంది. కావ్యా మారన్ నేతృత్వంలోని సన్ గ్రూప్ ఇటీవలే హండ్రెడ్ లీగ్‌లోని సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీలో మెజార్టీ శాతం వాటాను సొంతం చేసుకుంది.ఈ క్రమంలో తొలిసారి జరుగుతున్న వేలంలో పాల్గొన్న ఆమె.. పాక్ ఓవరాక్షన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను 1.9 లక్షల స్టెర్లింగ్ పౌండ్లకు (రూ. 2.34 కోట్లు) కొనుగోలు చేసింది. మరో ఫ్రాంచైజీతో (ట్రెంట్ రాకెట్స్) పోటీపడి మరీ అబ్రార్‌ను దక్కించుకుంది. ఈ చర్యతో కావ్యా భారత క్రికెట్ అభిమానుల పాలిట విలన్‌గా మారిపోయింది. అబ్రార్ అహ్మద్ ఇటీవలికాలంలో టీమిండియాతో ఆడిన మ్యాచ్‌ల్లో ఓవరాక్షన్ చేశాడు. ఓ సందర్భంలో భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఔట్ చేసి చాలా అతి చేశాడు. ఇందుకు భారత ఆటగాళ్లు కూడా తగిన కౌంటర్లు ఇచ్చినప్పటికీ భారతీయుల కసి తీరలేదు. అలాంటి అబ్రార్‌ను కావ్యా మారన్ జట్టులో చేర్చుకోవడం భారతీయులకు మింగుడుపడటం లేదు.దీనికి ముందే కావ్యా మరో పాక్ ఆటగాడు (హరీస్ రౌఫ్) వేలానికి రాగా, అతన్ని రిజెక్ట్ చేసింది. అప్పుడు శభాష్ అనుకున్న భారత క్రికెట్ అభిమానులు, అబ్రార్ తీసుకున్న వెంటనే సోషల్‌మీడియా వేదికగా భారీ ట్రోలింగ్ ప్రారంభించారు. ఇదే వేలంలో మరో పాక్ ఆటగాడు ఉస్మాన్ తారిక్‌ను బర్మింగ్హమ్ ఫీనిక్స్ 1.4 లక్షల స్టెర్లింగ్ పౌండ్లకు (రూ. 1.72 కోట్లు) దక్కించుకుంది. వేలంలో ఇప్పటివరకు అమ్ముడుపోయిన పాక్ ఆటగాళ్లు ఉస్మాన్ తారిక్, అబ్రార్ అహ్మద్ మాత్రమే. మరో పాక్ ఆటగాడు షాదాబ్ ఖాన్ కూడా వేలానికి వచ్చినా ఏ ఫ్రాంచైజీ అతనిపై ఆసక్తి చూపలేదు. కాగా, కొద్ది గంటల ముందే పాక్ స్టార్ బౌలర్ షాహీన్ అఫ్రిది ఈ వేలం బరి నుంచి వైదొలిగాడు. ఈ వేలంలో మొత్తం 13 మంది పాక్ ఆటగాళ్లు పాల్గొంటున్నారు.ఇదిలా ఉంటే, ఇంగ్లండ్ వేదికగా జరిగే హండ్రెడ్ లీగ్‌లో తొలిసారి ఆటగాళ్ల వేలం జరుగుతుంది. ఈ సీజన్ (2026) నుంచే ఈ సాంప్రదాయం ప్రారంభమైంది. దీనికి ముందు ఆటగాళ్ల ఎంపిక డ్రాఫ్ట్ ద్వారా జరిగేది. ఈ సీజన్‌తో తొలిసారి ఐపీఎల్ తరహా వేలం జరుగుతుంది. నిన్న (మార్చి 11) మహిళల విభాగం వేలం పూర్తి కాగా.. ఇవాళ (మార్చి 12) పురుషుల వేలం జరుగుతుంది. మొత్తం 8 ఫ్రాంచైజీలు ఆటగాళ్ల కోసం పోటీపడుతున్నాయి.ఇప్పటివరకు జరిగిన పురుషుల వేలంలో ఇంగ్లండ్ యువ ఆల్‌రౌండర్ జేమ్స్ కోల్స్ అత్యధికంగా 3.9 లక్షల స్టెర్లింగ్ పౌండ్లు (లండన్ స్పిరిట్) దక్కించుకున్నాడు. భారత కరెన్సీలో ఈ మొత్తం రూ. 4.8 కోట్లు. కోల్స్ తర్వాత అత్యధిక ధర జోర్డన్ కాక్స్‌కు దక్కింది. అతన్ని వెల్ష్‌ఫైర్ 3 లక్షల పౌండ్లకు (రూ. 3.6 కోట్లు) సొంతం చేసుకుంది.

## హార్దిక్ పాండ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాది



టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఓ వివాదంలో చిక్కుకున్నాడు. పుణెకు చెందిన లాయర్ వాజిద్ ఖాన్ శివాజీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో హార్దిక్ పాండ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీ20 వరల్డ్ కప్ 2026ను టీమ్‌ఇండియా కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన సంబరాల్లో హార్దిక్ పాండ్య జాతీయజెండాను ఒంటికి చుట్టుకొని కనిపించాడు. ఇదే ప్రస్తుత వివాదానికి కారణమైంది. 'మీరు వరల్డ్ కప్ వేడుకల్లో చూసే ఉంటారు. హార్దిక్ పాండ్య తన గర్ల్ ఫ్రెండ్‌తో కలిసి మైదానంలో గెంతులు వేశాడు. ఆ సమయంలో అతడు జాతీయ జెండాను తన ఒంటికి కట్టుకొన్నాడు. 1971 నేషనల్ ఫ్లాగ్ యాక్ట్ సెక్షన్ 2 ప్రకారం మనం జాతీయజెండాకు గౌరవం ఇవ్వాలి. హార్దిక్ పాండ్య ఈ వేడుకలో జాతీయ జెండాను ధరించి, తన స్నేహితురాలితో కలిసి వేదికపై కూర్చొన్నాడు. ఇది జాతీయజెండాను అవమానించడమే అని నేను నమ్ముతున్నాను' అని వాజిద్ ఖాన్ అన్నాడు. అందుకే నేను శివాజీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశాను. అప్పుడు వారు (పోలీసులు) ఆ సంఘటన ఇక్కడ జరగలేదు కదా అని అన్నారు. జాతీయ జెండా అనేది యావత్ దేశానికి చిహ్నం. కాబట్టి ఎక్కడైనా ఫిర్యాదు చేయొచ్చని వారికి వివరించా. చివరికి వారు నా ఫిర్యాదు స్వీకరించారు. వారు నాకు దానికి సంబంధించిన కాపీ కూడా ఇచ్చారు. తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం. నేనైతే ఫిర్యాదు చేశా' అని అతడు పేర్కొన్నాడు.

# ఎంఎస్ ధోనికి భారీ ఊరట




ధోనిపై 2024 ఫిబ్రవరిలో ఫిర్యాదు నమోదైంది. ఇలా వ్యవహరించడం బీసీసీఐ నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొనబడింది. 2018లో సవరించిన రూల్ 38(4)(a), 38(4)(p) ప్రకారం ఇది తప్పు అని ఫిర్యాదుదారు వాదించారు. అదనంగా, ధోని తప్పని సరి డిస్క్లోజర్ బాధ్యతలను కూడా నిర్వర్తించలేదని ఆరోపించారు.ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన జస్టిస్ మిశ్రా.. ధోని ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అతనికి వ్యతిరేకంగా ఎలాంటి విరుద్ధ ప్రయోజనాల కేసు నిలబడదని స్పష్టం చేశారు. ధోని 2017లో ఆర్కా సంస్థతో ఒప్పందం చేసుకున్నారని, బీసీసీఐ సవరించిన నిబంధనలు 2018 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు. అందువల్ల, ధోని ఆటగాడిగా ఉన్న సమయంలో ఎలాంటి విరుద్ధ ప్రయోజనం లేదని తేల్చారు. ఫిర్యాదుదారుడు వ్యక్తిగత కారణాలతోనే ఈ కేసు వేసినట్లు తీర్పులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ధోనిని 2026 ఐపీఎల్ సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ రీటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. సీఎస్‌కే సీఈవో ఇటీవల చెప్పిన దాని ప్రకారం.. ధోని ఈ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. వయసు పైబడిన రిత్యా ధోని ఈ సీజన్‌కు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండరని తొలుత ప్రచారం జరిగింది. తాజాగా సీఈవోనే స్పష్టత ఇవ్వడంతో ఉహాగానాలకు తెరపడింది.

2026 సీజన్‌కు సంబంధించి తొలి విడత షెడ్యూల్‌ను నిన్ననే విడదల చేశారు. ఈ విడతలో అన్ని ఫ్రాంచైజీల్లాగే సీఎస్‌కే కూడా నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది.

తొలి దశలో సీఎస్‌కే షెడ్యూల్

మార్చి 30: CSK vs RR - గౌహటి

ఏప్రిల్ 3: CSK vs PBKS - చెన్నై

ఏప్రిల్ 5: CSK vs RCB - బెంగళూరు

ఏప్రిల్ 11: CSK vs DC - చెన్నై

కాగా, ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. బెంగళూరు వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ..

# సన్‌రైజర్స్ కు కష్టమే!

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 ఆరంభానికి రంగం సిద్ధమైంది. మార్చి 28న క్యాష్ రిచ్ లీగ్ తాజా ఎడిషన్‌కు తెరలేవనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) ఇందుకు సంబంధించి తొలి విడత షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించింది.**

**ఇరవై మ్యాచ్‌ల షెడ్యూల్ మాత్రమే**




ఓవైపు ఇరాన్‌తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. మరోవైపు.. తమిళనాడు, అసోం, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేవలం 20 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను మాత్రమే బీసీసీఐ విడుదల చేసింది.ఇందులో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) జట్టు తొలి మ్యాచ్‌లో మార్చి 28న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (RCB)తో తలపడుతుంది. ఇందుకు బెంగళూరు వేదిక. ఇక రెండో మ్యాచ్‌లో ఏప్రిల్ 2న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో కోల్‌కతాలో.. తదుపరి ఏప్రిల్ 5న హైదరాబాద్‌తో లక్నో సూపర్ జెయింట్స్‌తో.. అనంతరం ఏప్రిల్ 11న పంజాబ్ కింగ్స్‌తో న్యూ చండీగఢ్‌లో తలపడనుంది.ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా సన్‌రైజర్స్ గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. తొలి విడత షెడ్యూల్‌లో భాగంగా మూడు మ్యాచ్‌లు సొంత మైదానం వెలుపల ఆడటం తలనొప్పిగా మారుతుందన్నాడు.

సన్‌రైజర్స్‌కు కష్టమే!

**"గుజరాత్ టైటాన్స్‌తో పాటు సన్‌రైజర్స్ తొలి నాలుగు మ్యాచ్‌లలో మూడు సొంత మైదానంలో కాకుండా.. ఇతర వేదికలపై ఆడాల్సి ఉంది. నాకైతే సన్‌రైజర్స్ గురించే బాధంతా!**

వాళ్లకు ఫ్లాట్ పిచ్‌లు కావాలి. కానీ ఆయా వేదికల్లో వీరి కోసం ఎవరూ ఇలాంటి పిచ్‌ను తయారు చేయలేరు. సొంత మైదానంలో ఒకే ఒక్క మ్యాచ్.. అది కూడా మధ్యాహ్నం షెడ్యూల్ చేశారు. నిజానికి సన్‌రైజర్స్‌కు హోం గ్రౌండ్‌లో సీజన్ ఆరంభించడమే మంచిది.అక్కడైతే వారు శుభారంభం అందుకోగలరు. వారి విజయాలు, ఆత్మవిశ్వాసంపై ఇది కచ్చితంగా ప్రభావం చూపే అవకాశం ఉంది'' అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. కాగా సన్‌రైజర్స్‌లో అభిషేక్ శర్మ, ట్రవిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర వీరులు ఉన్న విషయం తెలిసిందే.

## బుమ్రాలో వాళ్లిద్దరినీ చూస్తున్నా...

## అతని వల్లే భారత్‌కు ప్రపంచకప్: పాక్ దిగ్గజం జహీర్ అబ్బాస్




పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం జహీర్ అబ్బాస్ భారత క్రికెటర్లపై ప్రశంసల వర్షం కురిపించాడు. ముఖ్యంగా బ్యాటర్ సంజూ శాంసన్, పేసర్ జస్ప్రీత్ బుమ్రా ప్రదర్శనలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. టీమిండియా ప్రపంచకప్ గెలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, వారు ఛాంపియన్‌లా ఆడారని అభినందించాడు.స్పోర్ట్స్ నౌతో మాట్లాడుతూ జహీర్ అబ్బాస్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సంజూ శాంసన్ టాప్ ఆర్డర్‌లో అద్భుతంగా ఆడాడు. మూడు మ్యాచ్‌లలో మూడు సార్లు 80కి పైగా పరుగులు చేయడం అసాధారణమైన విషయం. ఇక, జస్ప్రీత్ బుమ్రా గురించి ఏం చెప్పాలి? అతను అసాధారణమైన ప్రతిభావంతుడు. జట్టు మొత్తం ప్రదర్శన అత్యుత్తమంగా ఉంది" అని తెలిపాడు.బుమ్రాను పాకిస్థాన్ బౌలింగ్ దిగ్గజాలతో పోలుస్తూ, "బుమ్రా.. వకార్ యూనిస్, వసీం అక్రమ్‌ల కలయిక. భారత్ అందించిన అత్యుత్తమ బౌలర్లలో అతనొకడనడంలో సందేహం లేదు. అతని యార్కర్లు, పేస్, కీలక సమయాల్లో బంతిని స్వింగ్ చేసే సామర్థ్యం అమోఘం. ఈ ప్రదర్శనతో అతను ఒంటిచేత్తో తన జట్టుకు ప్రపంచకప్ గెలిపించాడు" అని జహీర్ అబ్బాస్ అభిప్రాయపడ్డాడు."భారత్ ఛాంపియన్‌లా ఆడింది. వారు ఈ టోర్నమెంట్ గెలవాల్సిందే. వారు మూడుసార్లు ఈ ఘనత సాధించారు. వారికి నా అభినందనలు. ఈ విజయానికి వారు పూర్తిగా అర్హులు" అని 78 ఏళ్ల అబ్బాస్ పేర్కొన్నాడు. 1969 నుంచి 1985 వరకు పాకిస్థాన్ తరపున ఆడిన జహీర్ అబ్బాస్, 78 టెస్టులు, 62 వన్డేలలో ప్రాతినిధ్యం వహించాడు.